రోడ్లు ఇలా.. రాకపోకలెలా?

గోపాలపట్నం బంక్ ప్రాంతంలో పలు భవన నిర్మాణాలు జరుగుతున్నాయి. అయితే నిర్మాణ దారులు నిర్మాణ సామగ్రిని రహదారులపైనే వేస్తుండడంతో పాదచారులు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై సచివాలయ టౌన్ ప్లానింగ్ కార్యదర్శులు, జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కనీసం పని పూర్తయిన తర్వాత అయినా మిగిలిన సామగ్రిని తొలగించకుండా రోజుల తరబడి అలాగే వదిలేస్తున్నారని వాపోతున్నారు. అధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - గోపాలపట్నం


గోపాలపట్నం పుడాకాలనీలో రోడ్డుపై వేసిన నిర్మాణ సామగ్రి


గోపాలపట్నం బంక్ వద్ద ఎగువకు వెళ్లే రోడ్డు సామగ్రి


ఇదే ప్రాంతంలో రోడ్డుకు అడ్డంగా..

క్లుప్తంగా

స్వచ్ఛతపై అవగాహన


స్వచ్ఛతపై ప్రదర్శన ఇస్తున్న జానపద కళాకారులు

మల్కాపురం: హెచ్‌పీసీఎల్ (విశాఖ రిఫైనరీ) సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ పక్షోత్సవాలు సోమవారం మొదలయ్యాయి. ఈ నెల 15 వరకు వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. తొలి రోజు హెచ్‌పీసీఎల్ ప్రధాన గేటు వద్ద సంస్థ ఈడీ (వీఆర్)ఆర్. రామకృష్ణన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పరిశుభ్రమైన వాతావరణం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. జానపద కళాకారులు తమ నృత్య ప్రదర్శన ద్వారా గీతాలను ఆలపిస్తూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

5న 'శతాక్షి కవితల సంపుటి' ఆవిష్కరణ

సీతంపేట: అరసం విశాఖ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీ సాయంత్రం 6 గంటలకు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో కవి, ఆకాశవాణి పూర్వపు కార్యక్రమాధిపతి రొక్కం కామేశ్వరరావు రచించిన 'శతాక్షి కవితల సంపుటి' పుస్తకావిష్కరణ సభ జరుగుతుందని సంస్థ ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్.శర్మ ముఖ్య అతిథిగా పుస్తకావిష్కరణ, కె.జి.వేణు పుస్తక సమీక్ష చేస్తారని చెప్పారు. కవులు, రచయితలు, కళాకారులు, సాహితీవేత్తలు కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

త్వరితగతిన వినతుల పరిష్కారం


ప్రజల అర్జీలు పరిశీలిస్తున్న జోన్-5 కమిషనర్ కృష్ణ

కంచరపాలెం: జ్ఞానాపురం జీవీఎంసీ జోన్-5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి నాలుగు అర్జీలను జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ స్వీకరించారు. ప్రజా వినతులను త్వరితగతిన పరిష్కరించాలని ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. టౌన్ ప్లానింగ్‌కు 02, రెవెన్యూ విభాగానికి 02 చొప్పున వినతులు అందినట్లు జెడ్సీ తెలిపారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ ఈఈలు టి.ప్రసన్నరెడ్డి, మత్స్యరాజు, ఏసీపీ వెంకటరావు, ఏపీడీలు కమలావతి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథస్వామి ప్రచార రథం ప్రారంభం


ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, తదితరులు

డాబాగార్డెన్స్ : టౌన్ కొత్తరోడ్డులో వెలసిన జగన్నాథస్వామి రథయాత్ర ఉత్సవాలను పురస్కరించుకొని ప్రచార రథాన్ని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి సేవలో పాల్గొనే భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఈవోకు సూచించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి రాజగోపాల్‌రెడ్డి, అర్చకుడు జగన్నాథాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ


89వ వార్డులో పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే గణబాబు, కార్పొరేటర్ వెంకటరమేష్

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డులో ఎమ్మెల్యే గణబాబు పింఛన్లు పంపిణీ చేశారు. పెంచిన రూ. 4000 పింఛనుతో పాటు మొత్తంగా రూ. 7000 నగదు అందించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ హేమావతి, కార్పొరేటర్ దాడి వెంకటరమేష్, టీడీపీనాయకులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు. 89,91, 92 వార్డుల్లో సుమారు 89 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయిందని అధికారులు తెలిపారు.

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలోని పలు వార్డుల్లో సచివాలయాల సిబ్బందితో కలిసి కూటమి పార్టీలకు చెందిన నాయకులు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. 61వ వార్డు మల్కాపురంలో ఎమ్మెల్యే గణబాబు పలువురు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందించారు. కార్యక్రమంలో వార్డు టీడీపీ,జనసేన నాయకులు దినకర్,మజ్జి సోమేష్,సర్వసిద్ధి శ్రీలక్ష్మి,కాకి పొలిరెడ్డి పాల్గొన్నారు. అలాగే ప్రకాష్‌నగర్‌లో జరిగిన కార్యక్రమంలో టీడీపీ అనుబంధ క్రిస్టియన్ ప్రతినిధి ఉరుకూటి డేవిడ్,ఆదినారాయణ,జోజిబాబు తదితరులు పాల్గొన్నారు.

వనితల ఆరోగ్యంతోనే కుటుంబ సౌభాగ్యం


మాట్లాడుతున్న డాక్టర్ అనూష

మురళీనగర్: వనితలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబం అంతా ఆరోగ్యంగా ఉంటుందని గైనకాలజిస్ట్ డాక్టర్ అనూష కంటిమహంతి అన్నారు. వనితా వాకర్స్ క్లబ్ నెలవారీ సమావేశం క్లబ్ అధ్యక్షురాలు పి.ప్రభాకర్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉదయం నడకతోపాటు యోగా చేయాలని సూచించారు. జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని, ఇంటిలో తయారు చేసిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. మెనోపాజ్ సమయంలో మహిళలు ఎదుర్కొనే సమస్యలను వివరించారు. డాక్టర్ అనూషను సభ్యులు సత్కరంచారు. ఈ నెలలో పుట్టిన రోజు జరుపుకుంటున్న సభ్యులకు చిరుకానుకలు అందించారు. డిస్ట్రిక్ట్-101 పూర్వ గవర్నర్ ఉప్పలపాటి శుభ, పూర్వ అధ్యక్షురాలు జె.ఉమాదేవి, పూర్వ కార్యదర్శి డి.జ్యోష్న, సుధ, జాలీ వాకర్ ఎం.ప్రమీలారావు, కార్యదర్శి ఎం.జయ, కోశాధికారి జి.షీలారాణి, బులిటిన్ ఎడిటర్ ఆర్.స్నేహలత, జాయింట్ సెక్రటరీ ఆర్.రత్నకుమారి, జి.శిరీషలత పాల్గొన్నారు.

జీవీఎంసీ దఫేదార్లకు సత్కారం


సత్కరించిన దఫేదార్లతో అసోసియేషన్ ప్రతినిధులు

డాబాగార్డెన్స్: పదవీ విరమణ పొందిన జీవీఎంసీ దఫేదార్లను సోమవారం సత్కరించా రు. జీవీఎంసీ దఫేదార్ల అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు సీహెచ్ రామనారాయణ, అసోసియేషన్ అధ్యక్షుడు నరేష్ కుమార్ చేతుల మీదుగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయ ప్రాంగణంలో గల జెమ్స్ హాల్‌లో ఘనంగా సత్కరించారు. పదవీ విరమణ పొందిన సుంకరి రాము, గడదాసు మోగారావు దంపతులను సత్కరించి అభినందించారు. శేష జీవితం సాఫీగా సాగిపోవాలని అభిలషించారు. వారి సేవలను కొనియాడారు.

జయహో జగన్నాథా..

- జగన్నాథస్వామి రథోత్సవాలకు సర్వం సిద్ధం
- 7 నుంచి 9 రోజుల పాటు ఉత్సవాలు
- పూరీ తరహాలో నిర్వహణకు ఏర్పాట్లు


పూజలు అందుకుంటున్న బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథుడు


ఉక్కు జగన్నాథ స్వామి ఆలయం

ఉక్కునగరం: జగన్నాథస్వామి నవరాత్రి మహోత్సవాలకు స్టీల్‌ప్లాంట్‌లోని ఆలయం ముస్తాబైంది. జూలై 7 నుంచి తొమ్మిది రోజుల పాటు నిర్వహించనున్న ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది. పూరీ జగన్నాథస్వామి ఆలయంలో మాదిరిగానే ఉక్కునగరం ఆలయంలోనూ ఒడిశా పూజారులు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ప్రతీ ఏడా ది ఆషాడ ద్వితీయ నాడు బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథుడు ఊరేగింపుగా సెక్టార్-8లో ఉన్న ఇంద్రద్యుమ్న హాల్లోకి వెళ్లి అక్కడ 9 రోజులు ఉండి, అనంతరం ఊరేగింపుగా తిరిగి ఆలయానికి చేరుకుంటారు. ఈ ఉత్సవ కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ సీఎండీ బంగారు చీపురుతో రథాన్ని ఊడ్చి, రథాన్ని ఊరేగించటం ఆనవాయితీగా వస్తోంది. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్టీల్‌ప్లాంట్‌లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు, దేశంలోని ప్రముఖ కళాకారులతో ప్రదర్శనలు ఏర్పాటు చేస్తుంటారు. పూరీలో ఆదివారం నుంచి రథోత్సవాలు ప్రారంభం కానుండటంతో స్టీల్‌ప్లాంట్‌లోనూ అప్పటి నుంచి నిర్వహించడానికి నిర్వాహక కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ నెల 17 వరకు జరగనున్న ఉత్సవాల్లో భాగంగా ఉదయం ప్రత్యేక పూజలు, సాయంత్రం 7 గంటల నుంచి వివిధ సాంస్కృతిక కార్యక్రమాల మధ్య పూజలు నిర్వహించనున్నారు. ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఉక్కునగరం, పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు వేలాదిగా తరలిరానున్నారు.

నవరాత్రి ఉత్సవాలు

తేదీ	కార్యక్రమాలు
జూలై 7	సాయంత్రం 3.30 గంటలకు రథయాత్ర
	సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభం
	శ్రీకృష్ణ కళామందిరం ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శన
జూలై 8	భజరంగీ భజన్ మంజరి ఆధ్వర్యంలో భజనలు
జూలై 9	శ్రీ సాయి కళా కేంద్రం ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శన
జూలై 10	నిర్మల డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన
జూలై 11	వైశాలి డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఫోక్ డాన్స్
జూలై 12	శ్రీ వెంకటరమణ గ్రూప్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ లీలలు కూచిపూడి నృత్యం
జూలై 13	అగనంపూడి డాన్సింగ్ స్టెప్స్ గ్రూప్ ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శన
జూలై 14	సప్తేశ్వర భక్తి గీతాంజలి ఆధ్వర్యంలో భజనలు
జూలై 15	శశికిరణ్ బ్లూ-1 డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శన
జూలై 16	భజనలు, నృత్య, సంగీత ప్రదర్శనలు
జూలై 17	రాత్రి 7 నుంచి 10 గంటల వరకు సమారాధన

అతిసారతో ఒక్కరూ చనిపోరాదు


ప్రసంగిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట : అతిసారతో ఒక్కరూ చనిపోరాదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కొబ్బరితోట వద్ద స్టాప్ డయేరియాపై సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. అతిసార వ్యాధిని ఎలా గుర్తించాలి..?, ఎలా నివారించాలో..? తెలియజేశారు. వాంతులు, విరేచనాలు సంభవించినప్పుడు ఆరోగ్య సిబ్బందిని సంప్రదించి ఓఆర్ఎస్ ద్రావణం ఎలా తయారు చేసుకోవాలో వివరించారు. ఐదేళ్లలోపు పిల్లల విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలు పట్టించడం, చేతులు శుభ్రంగా ఉంచడం, వ్యాధి నిరోధక టీకాలు తరచూ వేయించాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్లు కె.పద్మావతి, కె.నాగరాజు, జీవీఎంసీ సీఎంహెచ్‌వో డాక్టర్ నరేష్ కుమార్, వివిధ విభాగాల డాక్టర్లు ఎస్.జీవన రాణి (జిల్లా టీకాల అధికారి), డాక్టర్ బి.ఉమావతి (నోడల్ అధికారి), జిల్లా మీడియా విస్తరణ అధికారి(డిమో) బి.నాగేశ్వర రావు, డీపీవో శశిభూషణ్, శ్రీలత, నాగభూషణం పాల్గొన్నారు.

వారంలో ఒకరోజు ప్రజారవాణా వినియోగిద్దాం

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ


జీవీఎంసీకి సైకిల్‌పై వస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

డాబాగార్డెన్స్: వారంలో ఒక్కరోజు ప్రజా రవాణా వినియోగించడం ద్వారా విశాఖ నగర కాలుష్యాన్ని అరికట్టవచ్చని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పిలుపునిచ్చారు. తన బంగ్లా నుంచి సోమవారం సైకిల్‌పై జీవీఎంసీకి చేరుకున్నారు. అనంతరం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా పరిష్కార వేదికలో పాల్గొని ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్న దృష్ట్యా కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ యంత్రాంగం వారంలో ఒకరోజు ప్రజా రవాణాను వినియోగించే నిర్ణయం మేరకు జీవీఎంసీ ఉద్యోగులతో పాటు అందరం దానిని అమలు చేస్తున్నామన్నారు. ఎకో వైజాగ్ అభివృద్ధి నేపథ్యంలో జీరో పొల్యూషన్ కార్యక్రమంలో భాగంగా నగరంలో పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ అనేక చర్యలు చేపడుతోందని చెప్పారు.

కామేశ్వరరావుకు ఘన సత్కారం


రిటైర్డ్ హెచ్‌ఎం కామేశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న ఆర్‌జేడీ విజయ్‌భాస్కర్ తదితరులు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు హెచ్‌సీ వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హెచ్.కామేశ్వరరావు దంపతులను సోమవారం స్కూల్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. హెచ్‌ఎం కామేశ్వరరావు పదవీ విరమణ చేసిన సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆర్‌జేడీ బి.విజయభాస్కర్, డీఈవో చంద్రకళ పాల్గొని ఆయన సేవలను కొనియాడారు. పాఠశాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. ఇందుకు స్కూల్ కమిటీ కూడా సరైన తోడ్పాటు అందించారని చెప్పారు. గతంలో ఈ పాఠశాల చాలా అధ్వానంగా ఉండేదని, ఇపుడు అద్భుతంగా మారిందని తెలిపారు. ఇందుకు కామేశ్వరరావు చూపిన చొరవే కారణమని ప్రశంసించారు. కామేశ్వరరావు దంపతులను పుష్పగుచ్ఛాలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో కె.సువర్ణ, ఎంఈఓ సోమేశ్వరరావు, ఇ.హైదిరాజు, స్కూల్ కమిటీ చైర్మన్ నీలాపు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓం ఫ్రీ యోగా వ్యవస్థాపకుడు రమేష్‌కు గౌరవ డాక్టరేట్


గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న రమేష్

ఎంవీపీ కాలనీ: ఓం ఫ్రీ యోగా సెంటర్ వ్యవస్థాపకుడు చిలకా వెంకట రమేష్‌కు గౌరవ డాక్టరేట్ లభించింది. యోగాలో చేస్తున్న విస్తృత సేవలకు గాను న్యూఢిల్లీకి చెందిన సోక్రటీస్ సోషల్ రీసెర్చ్ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసిందని రమేష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన ఆ యూనివర్సిటీ వార్షికోత్సవంలో ఈ డాక్టరేట్ పట్టాను అందుకున్నట్టు పేర్కొన్నారు. ఈ గౌరవ డాక్టరేట్ లభించడంపై ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఓం ఫ్రీ యోగా సెంటర్‌కు 'యోగాసనా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్'లభించిందన్నారు. గత 11 ఏళ్లగా విశాఖ వాసులకు యోగా సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉచిత యోగా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. యూట్యూబ్‌తో పాటు ఇతర సామాజిక మాధ్యమాల ద్వారా కూడా శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. డాక్టరేట్ అందుకున్న రమేష్‌కు పలువురు నగర ప్రముఖులు, శ్రేయోభిలాషులు అభినందనలు తెలియజేశారు.

వైద్య వృత్తి పవిత్రమైనది


గోపాలపట్నం ఆస్పత్రిలో కేక్ కట్‌చేస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ సుజాత

గోపాలపట్నం: వైద్య వృత్తి చాలా పవిత్రమైనదని, అందరూ వైద్యులను దేవుళ్లగా భావిస్తారని గోపాలపట్నం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ డాక్టర్ సుజాత అన్నారు. ఆస్పత్రిలో సోమవారం డాక్టర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేవుడు జన్మనిస్తే.. వైద్యులు పునర్జన్మను ఇస్తారన్నారు. మన వద్దకు వచ్చిన వారితో ప్రేమ పూర్వకంగా మాట్లాడాలని, వారిలోని భయాందోళనలను తొలగించాలన్నారు. ఇది వైద్యుల తొలి బాధ్యతని పేర్కొన్నారు. రోగుల బాధలు తెలుసుకోవడంతోనే చాలా మేరకు ఉపశమనం కలుగుతుందని చెప్పారు. వైద్యులపై ఒత్తడి ఉంటుందని, దాన్ని అధిగమించి వ్యాధిగ్రస్తులతో మాట్లాడాలని సూచించారు. గతంలో కంటే ప్రభుత్వ ఆస్పత్రుల్లో వసతులు పెరిగాయని, వైద్యులు అందుబాటులోకి వచ్చార, మరింత మెరుగైన సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఉచిత వైద్యాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సహచర వైద్యులతో కలిసి ఆస్పత్రిలో కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో వైద్యులు నివేదిత, పూర్ణిమ, షబ్నం, వీర్ కుమార్, పృథ్వీ, పావని, నాగలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి స్వర్ణ పుష్పార్చన నేడు

డాబాగార్డెన్స్: విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి, పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నెంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు. లేదా ఈ-మెయిల్ ఐడీ endow-eokanaka@gov. in ద్వారా తెలుసుకోవచ్చు.

1236వ రోజుకు 'ఉక్కు' రిలే దీక్షలు


దీక్ష శిబిరంలో పాల్గొన్న ఉక్కు కార్మిక సంఘాల నేతలు

అగనంపూడి: ప్రమాదపుటంచుల్లోకి నెట్టబడిన విశాఖ ఉక్కుపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తక్షణం స్పందించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, వి.శ్రీనివాసరావు కోరారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో నిర్వహిస్తున్న రిలే దీక్షలు సోమవారానికి 1236వ రోజుకు చేరాయి. కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కును పరిరక్షించాలంటే రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుంటేనే సాధ్యమన్నారు. ఈ విషయంలో ముందుచూపుతో వ్యవహరించకపోతే రాష్ట్ర ప్రజలు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిలపై పెట్టుకున్న నమ్మకం కూడా పోతుందని అన్నారు. మూడున్నర సంవత్సరాలుగా అగమ్యగోచరంగా ఉన్న విశాఖ ఉక్కును సరిదిద్దడానికి సంకీర్ణ ప్రభుత్వంలోని మూడు పార్టీల నాయకులు కదలి రావాలన్నారు. కార్యక్రమంలో దాసరి సురేష్, కామేశ్వరరావు, శ్రీనివాస్, సీతారామరాజు బషీర్‌బాబు, రామకృష్ణ, గోపాలరాజు, రాజేంద్రనాథ్, భాస్కరరావు పాల్గొన్నారు.

కళా సౌరభం.. సురభి నాటకం


లవకుశ నాటకంలో పలు సన్నివేశాలు

మద్దిలపాలెం : తరతరాలకు చెరగని తీపి జ్ఞాపక పరిజ్ఞానం సురభి నాటక సౌరభమని నంది అవార్డు గ్రహీత డాక్టర్ మీగడ రామలింగస్వామి అన్నారు. పద్మశ్రీ బాబ్జి తన నైపుణ్యంతో నేటి తరాలకు అందిస్తున్న అద్భుతం కళాఖండమని కొనియాడారు. సురభి నాటక ప్రదర్శనల్లో భాగంగా సోమవారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో లవకుశ నాటకాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతరించిపోతున్న అద్భుతాన్ని నేటి తరానికి అందించడానికి ప్రతి ఏడాదీ బాదంగీర్ సాయి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. బాదంగీర్ సాయి మాట్లాడుతూ రంగసాయి నాటక సంఘం పద్మశ్రీ బాబ్జీ పేరిట జీవన సాఫల్య పురస్కారాన్ని నాటక రంగ ప్రముఖులకు అందించనున్నామని ప్రకటించారు.

- లవకుశ నాటకం ఆద్యంతం ప్రేక్షకులు హృదయాలను రంజింపజేసింది. శ్రీరాముడి పట్టాభిషేకంతో ప్రారంభమైన నాటకం.. శ్రీరాముడు అయోధ్య రాజ్యాన్ని శాంతియుతంగా పరిపాలిస్తున్న తీరును చక్కని సన్నివేశాల నడుమ ప్రదర్శించారు. లవకుశల పాత్రల్లో కళాకారులు రక్తికట్టించారు. ప్రేక్షకులు తమ కరతాళ ధ్వనులతో నీరజనాలు పలికారు.